## హరితహారం చెట్లు నరికివేత



కనగర్తిలో రోడ్డు వెంబడి నరికివేసిన చెట్లు

కోనరావుపేట, మే 18: మండలంలోని కనగర్తి గ్రామంలో హరితహారం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. పల్లిమక్త గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి గత ప్రభుత్వంలో నాటిన మొక్కలు పూర్తిగా ధ్వంసం చేశారు. గతంలో వివిధ రకాల వేల మొక్కలను ఉపాధి హామీ కూలీలతో రోడ్డుకు ఇరువైపులా నాటించారు. ప్రస్తుతం ఆ చెట్లు రంగు రంగుల పూలతో పాటు చల్లనినీడనిస్తున్నాయి. ఈక్రమంలో రోడ్డు ప్రక్కన పంట పొలాలు ఉన్న రైతులు, గుర్తు తెలియని వ్యక్తులు మొక్కలను పూర్తిగా నరికివేస్తున్నారు. పంట వేసినప్పుడు నీడకు పంటలు ఎదగడం లేదని, వరికోతలు కోసిన వెంటనే వరికొయ్యకాలును కాల్చుతూ మొక్కలు తొలగిస్తున్నారు. అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా మాకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.



గంభీరావుపేట: పెద్దమ్మతల్లికి నమస్కరిస్తున్న కేటీఆర్

## ఆశీర్వదిస్తూ.. శుభాకాంక్షలు చెబుతూ..

**సిరిసిల్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విస్తృత పర్యటన**

సిరిసిల్ల టౌన్/ గంభీరావుపేట/ ఎల్లారెడ్డిపేట మే 18: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పలు శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ.. వారికి శుభాకాంక్షలు చెబుతూ ముందుకు సాగారు. సిరిసిల్ల పట్టణంతోపాటు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు. గంభీరావుపేట మండలం కోళ్లమద్దిలో మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించారు. పలు వివాహ వేడుకల వద్ద యువతీ యువకులు కేటీఆర్‌తో సెల్ఫీలు తీసుకున్నారు. చిన్నారులతో కలిసి వచ్చిన దంపతులు సైతం కేటీఆర్‌ను కలిసి ఫొటో దిగేందుకు ప్రయత్నించగా పిల్లలను ఎత్తుకుని ఫొటో దిగి వారి ముచ్చట తీర్చారు.







తంగళ్లపల్లి మండలం చీర్లవంచ సమీపంలోని మధ్యమానేరులో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన కేజీకల్చర్ షెడ్లు (ఫైల్)

## అటకెక్కిన 'ఆక్వాహబ్'!

**మత్స్య యూనివర్సిటీకి మంగళం**

- పదివేల మంది యువతకు ఉపాధే లక్ష్యంగా గత ప్రభుత్వంలో మంజూరు
- చీర్లవంచలో 365 ఎకరాల స్థలం కేటాయింపు
- ₹2వేల కోట్ల పెట్టుబడులతో పలు కంపెనీల రాక
- సర్కారు మారడంతో పట్టింపు కరువు
- మధ్యలోనే ఆగిపోయిన ప్రాజెక్టులు

**కార్మిక క్షేత్రంగా విలసిల్లుతూ.. అనేక పరిశ్రమలకు నిలయమైన సిరిసిల్లలో అతిపెద్ద మత్స్యపరిశ్రమ ఏర్పాటు కలగానే మిగిలింది. వేలాది మంది యువతకు ఉపాధి, పరిశోధనలకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన ఆక్వాహబ్, మత్స్య యూనివర్సిటీలపై ప్రస్తుతం తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నది. చీర్లవంచలో 365 ఎకరాల స్థలాన్ని కేటాయించి శంకుస్థాపనకు కసరత్తు పూర్తి చేసినా.. ₹2వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు సైతం ముందుకు వచ్చినా.. ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు అలసత్వంతో ఈ ప్రాజెక్టులు అటకెక్కినట్టు తెలుస్తున్నది. పాలకులు, అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టకపోవడంతో జిల్లావాసులకు నిరాశే ఎదురవుతున్నది. ఇప్పటికైనా స్పందించి ఏర్పాటుకు చొరవ తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తున్నది.**



రాజన్న సిరిసిల్ల, మే18 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమలో తెలంగాణకే తలమానికమైన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పరిశ్రమల ఏర్పాటుకు నాడు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. టెక్స్‌టైల్స్, అప్పారెల్ పార్కులను అభివృద్ధిలోకి తెచ్చింది. పొగచూరుతున్న బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి, మెరుగైన కూలీ కల్పించాలన్న ఉద్దేశంతో అప్పారెల్ పార్కులో రెండు అంతర్జాతీయ గార్మెంట్ పరిశ్రమలను ఇక్కడకు తీసుకువచ్చింది. ఆ కంపెనీల ఏర్పాటుతో ప్రస్తుతం రెండు వేల మంది మహిళలతో పాటు కొంత మంది పురుషులకు ఉపాధి లభించింది. అంతేకాదు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన నీలి విప్లవంతో మత్స్య కార్మికులకు చేతినిండా పని దొరికింది. రాజరాజేశ్వర, అన్నపూర్ణ, ఎగువ మానేరు ప్రాజెక్టులతో పాటు 440 చెరువుల్లో ఉచితంగా చేప పిల్లల పంపిణీతో మత్స్య సంపద దండిగా పెరిగింది. 106 మత్స్య పారిశ్రామిక సంఘాల్లోని 7636 కుటుంబాలకు ఉపాధి దొరికింది. ఈ క్రమంలోనే మధ్యమానేరులో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం వివిధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసింది. నర్సింగ్, మెడికల్, వ్యవసాయ పాలిటెక్నిక్, ఐటీఐ, అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్, వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేసింది. దీంతోపాటు పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలని, పది వేల మందికి ఉపాధి కల్పించాలని సంకల్పించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్వాహబ్, మత్స్య యూనివర్సిటీలు అటకెక్కాయి. ₹2వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన కంపెనీలకు సహకారం లేకపోవడంతో వెనకడుగు వేశాయి.

### మత్స్య యూనివర్సిటీ, ఆక్వాహబ్‌పై నిర్లక్ష్యం?

సిరిసిల్లను పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అప్పటి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ మత్స్య యూనివర్సిటీతోపాటు మధ్యమానేరు నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి కోసం ఆక్వాహబ్ ఏర్పాటుకు సంకల్పించారు. పదివేల మంది వరకు ఉపాధి పొందేలా ప్రతిపాదనలు చేశారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో 365 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ క్రమంలో ₹2 వేల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికాకు చెందిన ఫిషిన్ ఇండియా, ఫ్రెష్‌హోం, ఆనందాగ్రూప్, సీపీ ఆక్వా సంస్థలు ముందుకువచ్చి, ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. ఫిషిన్ ఇండియా కంపెనీ శ్రీరాజరాజేశ్వర జలాశయంలో కేజీ కల్చర్‌ను ట్రయల్ రన్ నిర్వహించింది. ఈ సంస్థకు 125 ఎకరాల స్థలం కేటాయించగా, ఈ ప్రాజెక్టులకు అప్పటి ప్రభుత్వం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయాలని నిర్ణయించింది. అప్పుడే ఎన్నికలు రావడంతో వాయిదా పడింది. తర్వాత అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో యూనివర్సిటీ ఏర్పాటుకు గ్రహణం పట్టింది. సర్కారు దీనిపై ఏమాత్రం దృష్టిసారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వమే గనుక ఉంటే యూనివర్సిటీకి శంకుస్థాపన జరిగి, భవన నిర్మాణాలు పూర్తి దశకు వచ్చేవని, ఆక్వా హబ్ ప్రారంభమై వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభించేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత సర్కారుతో వివిధ కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, ఈ ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ముందుకు రావడం లేదన్న చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం స్పందించి మత్స్య యూనివర్సిటీ, ఆక్వాహబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పేపర్ క్లిప్పింగ్‌ను చూపిస్తున్న జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## మన బిడ్డలకు పైసల్లేవ్ అన్నవ్..

## సుందరీమణులకు బంగారమా..?

- ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తానని నమ్మించినవ్
- ఇప్పుడు ఇతర దేశాలోళ్లకు ఒక్కొక్కరికి 30తులాలు ఇచ్చేందుకు ఎక్కడి నుంచి పైసలలు వచ్చినయ్?
- రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, మే 18: 'ఎన్నికల ముందు మన ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం ఇస్తానని నమ్మించినవ్. అధికారంలోకి వచ్చినంక పైసల్లేవ్ అన్నవ్. కానీ, ప్రపంచ సుందరీమణులకు ఒక్కొక్కరికి 30 తులాల బంగారం ఇచ్చేందుకు పైసలు ఎక్కడి నుంచి వచ్చినయ్? సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి' జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ తెలంగాణ పేద ఆడబిడ్డలపై లేదని మండిపడ్డారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో మహిళలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఆడబిడ్డలకు పెళ్లి కానుక పేరు మీద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక రాష్ట్రం దివాలా తీసిందని, ఎక్కడ అప్పు పుడుతలేవని స్టేట్‌మెంట్లు ఇచ్చుకుంటూ పరిపాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల ఓ మీటింగ్‌లో తనను కోసినా రూపాయి కూడా లేదని మాట్లాడారని, కానీ ఇప్పుడు అందాల పోటీలకు వచ్చిన అమ్మాయిలకు ఒక్కొక్కరికి 30 తులాల చొప్పున ఇచ్చేందుకు మొత్తం ₹200 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో..? చెప్పాలని ప్రశ్నించారు. ఎవరి మెప్పు కోసం ఇస్తున్నారని, మీకు తెలంగాణ ప్రజలు ఓట్లు వేశారా..? ఈ సుందరీమణులు వేశారా చెప్పాలన్నారు. ఈ ఫార్ములా రేస్ వల్ల తెలంగాణకు ₹750 కోట్లు లాభం వచ్చిందని, అందాల పోటీలతో వచ్చిన లాభం ఏమీ లేదని, ఖజానాకు రోజుకు ₹30 కోట్ల ఖర్చు బొక్క అని ఎద్దేవా చేశారు. అధికారం కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేశారని ఆగ్రహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివాహాలు చేసుకున్న అమ్మాయిలకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు



## సారూ మా పైసలు ఇప్పించండి

**జవహర్‌లాల్ నాయక్‌తండాలో హమాలీల నిరసన**

వీర్నపల్లి, మే18: ' సారూ మీకు దండం పెడుతం. పదిహేను రోజుల కింద వడ్లు కాంటా పెట్టినం. ఇప్పటికి రూపాయి రాలె. ధాన్యం మిల్లుకు తరలిస్తేనే రైతులు మాకు పైసలు ఇస్తామంటున్నరు. లారీలు రప్పించి ధాన్యం తరలించండి' అంటూ వీర్నపల్లి మండలం జవహర్‌లాల్ నాయక్ తండాలో హమాలీలు ఆదివారం బుక్ కీపర్ ఇంటి ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తండాలో పలువురు రైతులకు చెందిన 1500 బస్తాల సన్న రకం వడ్లు పదిహేను రోజుల కింద తూకం వేశామని, అప్పటి నుంచి లారీలు రాక ధాన్యం బస్తాలు సెంటర్‌లో ఉండిపోయాయని చెప్పారు. బస్తాలు మిల్లులకు తరలించక నిర్వాహకులు జాప్యం చేస్తున్నారని, దీంతో తమకు రావాల్సిన డబ్బులు రైతులు ఇవ్వడం లేదని వాపోయారు. 'మాకు సుమారు ₹1.50లక్షల దాకా రావాల్సి ఉంది. మా డబ్బులు ఇప్పిస్తే మా రాష్ట్రానికి వెళ్లిపోతం. అధికారులు స్పందించాలి' అని దీనంగా వేడుకున్నారు.






మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

## దళిత ఎంపీ అంటే చిన్నచూపెందుకు?

- ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిందే
- ఎంపీని అవమానపరిచిన అధికారులపై అట్రాసిటీ కేసు పెట్టాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, మే 18: పెద్దపల్లి దళిత ఎంపీ గడ్డం వంశీకృష్ణ అంటే చిన్నచూపెందుకు? అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో వార్డు మెంబర్ నుంచి మొదలుకొని ఎమ్మెల్యే, ఎంపీల వరకు ప్రతి ఒక్కరినీ అందరూ గౌరవించాల్సిందేనన్నారు. ఆదివారం మంథనిలోని రాజగృహలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని అవమాన పరుస్తున్నారని ఆరోపించారు. నలభై ఏండ్లపాటు ఎమ్మెల్యేగా పని చేసిన దుద్దిళ్ల కుటుంబం, దళితులను, బహుజనులను అవమానాలకు గురి చేస్తున్నదన్నారు. పెద్దపల్లి ఎంపీగా దళిత సామాజిక వర్గానికి చెందిన యువకుడు వంశీకృష్ణ ఉంటే అతనిపై శ్రీధర్‌బాబు అనేక రాజకీయ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అడుగడుగునా అవమానాలు చూపించడమే కాకుండా సదరు ఎంపీ సామాజిక వర్గానికి చెందిన వారితో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయించి తిట్టించడం చాలా బాధాకరమైన విషయమన్నారు. తాను ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో శ్రీధర్‌బాబు చాలా సార్లు అవమానపర్చారని ఆవేదన చెందారు. తన పేరు కూడా తీయడానికి అతను ఇష్టపడలేదని గుర్తు చేశారు. ఎంపీ వంశీకృష్ణ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కానీ రాజ్యాంగానికి లోబడి ఎంపీగా గెలిచిన వారిని గౌరవించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఈ కోణంలోనే తాను ఇలాంటి అప్రజాస్వామిక వ్యవస్థను ఖండిస్తున్నానని స్పష్టం చేశారు. కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల సందర్భంగా ప్రభుత్వ పరంగా దేవాదాయ శాఖ ద్వారా అన్ని పత్రికల్లో అడ్వర్టైజ్‌మెంట్లు వేయించారని, అందులో ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ వంశీకృష్ణ ఫొటోను వేయకుండా అవమాన పరిచారన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ మంత్రుల భారీ కటౌట్లు ఏర్పాటు చేసి వారి కాళ్ల కింద అమ్మవారి ఫొటోలను పెట్టుకొని అవమాన పరిచారన్నారు. ఎంపీకి జరిగిన అవమానంపై లోక్ సభ స్పీకర్, సెక్రెటరీ, అసెంబ్లీ సెక్రటరీ, రాష్ట్రపతికి ఫిర్యాదు చేశామన్నారు. ఎంపీ ఫొటోను ప్రభుత్వ ప్రకటనలో వాడకుండా అవమాన పరిచిన ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడంతో పాటు విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. మంథనిలో ప్రజాసామ్యాన్ని అవమానపర్చుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య పోరాటానికి శ్రీకారం చుట్టినట్టు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, ఎస్కే యాకుబ్, మాచీడి రాజుగౌడ్, జంజర్ల శేఖర్, కనవేన శ్రీనివాస్, పెగడ శ్రీనివాస్, ఎరుకల రవి పాల్గొన్నారు.

## అద్దె గదుల్లో వికృత చేష్టలు!

- వేములవాడలో నిబంధనలు ఉల్లంఘిస్తున్న నిర్వాహకులు
- ఎలాంటి వివరాలు తీసుకోకుండానే గదుల కేటాయింపు
- పనిచేయని సీసీ కెమెరాలు
- ఇదే అదునుగా అసాంఘిక ఘటనలు
- ఇటీవల ఓ జంట లక్ష్యంగా బెదిరింపులు!

**వేములవాడలోని కొన్ని అద్దె గదులు, లాడ్జిలు నిబంధనలకు నీళ్లొదులుతున్నాయి. నిర్వాహకులు అత్యాశకు పోయి ఎలాంటి వివరాలు తీసుకోకుండానే గదులు కేటాయిస్తుండడంతో వికృత చేష్టలు వెలుగుచూస్తున్నాయి. ఇటీవల గుర్తుతెలియని దుండగులు బెదిరింపులకు దిగి బలవంతపు వసూళ్లకు పాల్పడడం కలకలం రేపింది. ఇలా ఎన్నో ఘటనలు జరుగుతున్నా.. కొన్ని మాత్రమే పోలీస్ స్టేషన్ వరకు వస్తున్నాయి. భయభ్రాంతులకు లోనయ్యే వ్యక్తులు మాత్రం.. అయిందేదో అయిపోయిందనుకొని జారుకుంటున్న ఘటనలూ ఉంటున్నాయి.**

వేములవాడలో ప్రైవేట్ అద్దె గదులు (ఫైల్)




వేములవాడ, మే 18: వేములవాడ ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కొందరు ఒక్కరోజు ఇక్కడే ఉండి మొక్కులు సమర్పిస్తుంటారు. అయితే విడిది చేసే భక్తుల కోసం పట్టణంలో దాదాపు 400కు పైగా అద్దె గదుల భవనాలు వెలిశాయి. ఈ సముదాయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలి. లాగ్ బుక్ మెయింటన్ చేయాలి. విడిది కోసం గదిని ఇచ్చే సమయంలో సంబంధిత వ్యక్తుల ఫొటో ఉన్న గుర్తింపు కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్లు తీసుకోవాలి. అనుమానాస్పదంగా అనిపిస్తే పోలీసులకు సమాచారం కూడా ఇవ్వాలి. కానీ, కొందరు నిర్వాహకులు అత్యాశకు పోయి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఈ విషయంలో పలుసార్లు పోలీసులు హెచ్చరిస్తున్నా లెక్కచేయడం లేదు. కేసులు పెట్టి బెదిరిస్తున్నా వైఖరి మారడం లేదు. అద్దె గదులు వికృతి చేష్టలకు అడ్డాలుగా మారుతున్నాయి. కుటుంబంతో సహా వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

### ఎన్నో ఘటనలు..

ప్రైవేట్ అద్దె గదుల్లో విడిది చేసే వారి వివరాలను నమోదు చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అధిక డబ్బులకు ఆశపడి అసాంఘిక కార్యకలాపాలకు కేటాయిస్తున్న తరుణంలో ఏదైనా ఘటనలు జరిగినప్పుడు పోలీస్ శాఖ నివ్వెరపోయే పరిస్థితి వస్తున్నది. వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్‌లో పదేళ్ల క్రితం ఏకంగా స్టువర్టుపురం దొంగల ముఠా 15 రోజులపాటు అద్దె గదులు తీసుకొని ఉమ్మడి జిల్లాలో దొంగతనాలు చేసిన తీరు అప్పటి పోలీస్ శాఖను ఆశ్చర్యపోయేలా చేసింది. ఇక మరోవైపు ఓ మైనర్ జంటకు ఆశ్రయం కల్పించగా హైదరాబాద్ పోలీసులు వచ్చి తనిఖీలు చేసి కేసు నమోదు చేయడం కలకలం రేపింది. ఏడాది క్రితం అద్దె గదుల్లో ఓ మహిళ హత్యకు గురికాగా, అప్పుడు నిందితులను పట్టుకోవడం సవాల్‌గా మారింది. కొద్ది నెలల క్రితం ఓ వివాహితతో వచ్చిన వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందగా, సదరు వివరాలను కూడా సేకరించడంలో తలనొప్పిగా మారింది. ఇక ఇటీవలే అద్దె గదిలో దిగిన ఓ జంటను పోలీసులమని చెప్పి బెదిరింపులకు పాల్పడి నగదును కాజేయడమే కాకుండా, సదరు జంటపై అసభ్యంగా ప్రవర్తించిన తీరు ఆలస్యంగా వెలుగు చూసింది. అయితే, అద్దె గదుల భవనంలో సీసీ కెమెరాలు పనియేయకపోవడంతో జరిగిన ఘటనను గుర్తించడం కూడా సవాల్‌గా మారుతున్నది. అయితే, గది ఇచ్చే సమయంలో వివరాలు తీసుకోవడంలో కొందరు చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా రాజన్న సన్నిధికి కుటుంబంతో దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించాలని భక్తులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### కఠినంగా వ్యవహరిస్తాం



నిబంధనలు పాటించని ప్రైవేట్ అద్దె గదులు, లాడ్జి నిర్వాహకులపై కఠినంగా వ్యవహరిస్తాం. అసాంఘిక కార్యకలాపాలు, ఇతర వాటికి అద్దె గదులు ఇస్తే ఇప్పటికే నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తున్నాం. తప్పనిసరిగా సంబంధిత వ్యక్తుల ఫొటో గుర్తింపు కార్డు, ఫోన్ నంబర్లు కూడా నమోదు చేయాలని ఇప్పటికే సూచించాం. సీసీ కెమెరాలు పనితీరు కూడా సక్రమంగా ఉండాలని హెచ్చరించాం. పెడచెవిన పెట్టే వారిపై ఇకపై మరింత కఠినంగా వ్యవహరిస్తాం.

**- వీర ప్రసాద్, సీఐ (వేములవాడ)**